సాక్షి వికారాబాద్

బుధవారం । 6 । మార్చి । 2024



నిర్వహణ మరిచారు!

నందివాగు ప్రాజెక్టు నిర్వహణను గాలికొది లేశారు. తూములు తుప్పు పట్టాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. 8లో▸



పేకాట జోరు..

పరిగి నియోజకవర్గంలో పేకాట మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. 8లో▸



'డబుల్' లేట్

పూడూరు మండలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం మూడేళ్లుగా పునాదుల దశ వీడటం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య



మహిళలకు కుట్టుమిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న అంజయ్య తదితరులు

పరిగి: ఉచిత శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య సూచించారు. జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాక్ వారి సౌజన్యంతో 90 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఒకరిపై ఆధారపడి జీవించకుండా స్వయం ఉపాధిని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

12న తాండూరుకు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈనెల 12న తాండూరుకు రానున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ తెలిపారు. మంగళవారం పట్టణంలో జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు మంద కృష్ణమాదిగ వస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్కప్ప, అంజి, సూర్యప్రకాష్, శేఖర్, శ్రీనివాస్, శివాజీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'మనబడి' పనులు పూర్తి చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో మన ఊరు – మన బడి పథకం కింద చేపట్టిన పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మన ఊరు మనబడి పనులపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాలల భవనాలను, సీసీ రోడ్లు, ఇతర పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను తనకు పంపాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీ భవన నిర్మాణాలు, పాఠశాలల ప్రహరీలు, వంట గదుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

గులాబీలో అయోమయం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి ఎవరనేదానిపై చర్చ

- దైలమాలో సిట్టింగ్ ఎంపీ
- కాసాని పోటీ చేసే అవకాశం ఉందని ఊహాగానాలు
- బరిలో ఉన్నానంటున్న నాగేందర్‌గౌడ్
- పరిశీలనలో కార్తీక్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి పేర్లు



వికారాబాద్: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి. బీఆర్ఎస్ చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సుముఖంగా లేకపోవడంతో మరో అభ్యర్థి ఎవరనేదానిపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు పరిశీలనలో కూడా లేని పేర్లు సైతం తెరమీదకి వస్తున్నాయి. రంజిత్‌రెడ్డి ఎన్నికల షెడ్యూల్ రాకముందే కాడి వదిలేయడం ఆ పార్టీ క్యాడర్‌ను నిరుత్సాహానికి గురిచేసింది. రెండు నెలల క్రితం వరకు ఎంపీ అభ్యర్థిని తానేనని చెప్పుకుంటూ వచ్చారు. ఏడాది ముందు నుంచే కసరత్తు ప్రారంభించారు. అనూహ్యంగా పోటీకి సుముఖంగా లేని చెప్పడంతో క్యాడర్ అయోమయానికి గురైంది.

తెరపైకి పలువురి పేర్లు

నెల రోజులుగా అంతర్మథనంలో ఉన్న ఎంపీ రంజిత్‌రెడ్డి ఇటీవల జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో తాను పోటీ నుంచి తప్పుకుంటున్నానని తేల్చి చెప్పారు. దీంతో మరికొందరి ఆశావహుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కనీస పోటీ కూడా ఇవ్వకుంటే పరువు పోతుందనే భావనలో మరో సమర్థుడైన నాయకుడిని బరిలోకి దింపాలనే ఆలోచనతో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. అధిష్టానం దృష్టిలో లేని మరికొందరు నేతలు తాము పోటీ చేసేందుకు సిద్ధమంటూ ముందుకొస్తున్నారు. తమ పేర్లను కూడా పరిశీలించాలని అధిష్టానానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిసింది. కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపాలని బీఆర్ఎస్ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇందులో కొందరు తాము పోటీకి సుముఖంగా లేమని ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్.. అధిష్టానం అవకాశం ఇస్తే తాను పోటీకి సై అంటున్నారు. తన పేరు పరిశీలించాలని కోరుతున్నట్లు తెలిసింది.

నైరాశ్యంలో పార్టీ శ్రేణులు

అర్థబలం.. అంగబలం ఉండి అన్నీ తానై నడిపిస్తాడనుకున్న సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఎన్నికలకు ముందే తాను బరిలో ఉండనని చెప్పడంతో పార్టీ శ్రేణులు నైరాశ్యంలో మునిగి పోయాయి. జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరడం జరిగింది. దీంతో గ్రూపు రాజకీయాలకు తెరపడిందని అందరూ భావించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఒకతాటిపైకి తీసుకొస్తారని భావించారు. ఈ నేపథ్యంలో ఆయన అస్త్ర సన్యాసం చేయటం పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. అధికార కాంగ్రెస్ తరఫున పట్నం సునీతారెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలోకి దిగటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది తేలకపోవడం ఆ పార్టీ కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఎమ్మెల్యేలుగా ఓడిన నేతలు ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతుంటే బీఆర్ఎస్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థులందరూ ఓటమి పాలైన విషయం తెలిసిందే. కానీ వారిలో ఏ ఒక్కరు కూడా తాము ఎంపీ స్థానానికి పోటీ చేస్తామని చెప్పడం లేదు. ఇప్పటికే కొందరు ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా మరి కొందరు తాము పోటీలో లేమని తేల్చి చెబుతున్నారు.



ఆర్.కృష్ణయ్యతో పట్నం దంపతులు

నాయ'కుల' మద్దతు కోసం..!

- సామాజిక వర్గాల వారీగా ప్రధాన పార్టీల నజర్
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా పావులు
- బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్యను కలిసిన మహేందర్‌రెడ్డి దంపతులు
- 12న తాండూరులో మంద కృష్ణమాదిగ పర్యటన

తాండూరు: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో చెవేళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు కుల సంఘాల నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. చెవేళ్ల ఎంపీ స్థానంలో బీసీ ఓటర్లే కీలకం. దీంతో ఆయా సామాజికవర్గాల నేతలను తమ వైపు తిప్పుకొనేందుకు అధికార కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. 'చేవెళ్ల' పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 60శాతం వరకు బీసీ ఓటర్లు ఉన్నారు. ఇందులో ముదిరాజ్, మున్నూరు కాపు, గౌడ, యాదవ, ముస్లిం మైనార్టీ ఓటర్లు అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపనున్నారు. దీంతో అన్ని పార్టీల బాధ్యులు కుల సంఘాల మద్దతు కూడగట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నాలుగు రోజుల క్రితం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిశారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సునీతారెడ్డికి చెవేళ్ల టికెట్ ఇచ్చే అవకాశం ఉండటంతో పట్నం దంపతులు క్షేత్ర స్థాయిలో బలం పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించడంలో సక్సెస్ అయ్యారు. మరోవైపు రంగారెడ్డి జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో బలం పెంచుకునేందుకు పావులు కదుపుతున్నారు. కుల సంఘాల నేతలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ముస్లింల ఓట్లు 'చే'జారిపోకుండా మైనార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా ఎమార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈనెల 12న తాండూరులో పర్యటించనున్నారు.

'కొండా' జోరు

బీజేపీ తరఫున కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ ఖాయం కావడంతో ఆయన ప్రచారంలో జోరు పెంచారు. గ్రామాల్లో పర్యటిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన రథాలు, సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరో..?

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల విషయంలో స్పష్టత ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ కేండెట్ ఎవరనే విషయంలో సందిగ్ధం కొనసాగుతోంది. దీంతో ఆ పార్టీ తరఫున ఎవరు బరిలో ఉంటారనే అంశం ఆసక్తి రేపుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న సత్తార్

రసాయనాల వాడకం తగ్గాలి

జిల్లా ఉద్యాన అధికారి సత్తార్

అనంతగిరి: పంటల సాగులో రసాయనాల వాడకం తగ్గాలని, అప్పుడే భూ సారం దెబ్బతినకుండా ఉంటుందని జిల్లా ఉద్యాన అధికారి ఎంఏ సత్తార్ అన్నారు. మంగళవారం రైతు శిక్షణ కేంద్రం రాజేంద్రనగర్ వ్యవసాయ శాఖ అధికారులు వికారాబాద్ మండలంలో పర్యటించారు. నారాయణపూర్ రైతు వేదికలో ఏవో హిమబిందు, సిద్దులూర్‌లో ఏడీఏ దివ్యజ్యోతి, గొట్టిముక్ల రైతు వేదికలో ఏడీఏ రేష్మ రాజ్ అన్నదాతలతో సమావేశమయ్యారు. నారాయణపూర్ సమావేశంలో సత్తార్ మాట్లాడుతూ.. టమాటా, వంకాయ, మిరప పంటలకు రసం పీల్చు పురుగులు ఆశించకుండా నారు నాటినప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూరగాయల పంటలకు నీటి తడులు ఎక్కువ ఇస్తే మొక్క వేరు భాగాన నాచు తయారై పంట ఎండిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. మొక్క మొదలు వద్ద మట్టి పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. సిద్దులూర్, గొట్టిముక్ల రైతు వేదికల్లో దివ్యజ్యోతి, రేష్మరాజ్ మాట్లాడారు. రసాయన ఎరువులు వాడటం వల్ల భూమికి అవసరమయ్యే సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. రైతులు జీవన ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల అధికారి జ్యోతి, ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి జీ అనిల్‌కుమార్, నర్సింహారెడ్డి ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రక్షాళన దిశగా అడుగులు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఆ తర్వాత బయోమెట్రిక్ విధానం
- సమగ్ర సమాచారం సేకరించిన ఉన్నతాధికారులు



వికారాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

వికారాబాద్ అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలుత అక్రమాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమవుతోంది. కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బంది చేతివాటంతో అంగన్‌వాడీ గుడ్లు, పాలు, పప్పు వంటివి బహిరంగ మార్కెట్లో దర్శనమిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రెండు రోజుల క్రితం ధారూరు మండలం నాగారం గ్రామ శివారు పొలంలో అంగన్‌వాడీ ముద్ర ఉన్న గుడ్లు పారబోసిన సంఘటన సాక్షి దిన పత్రిక వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.

ముందుగా సీసీ కెమెరాలు

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముందుగా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. కేంద్రాలకు పిల్లలు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేస్తూ అక్కడి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. రోజువారి ఆహారం కూడా వడ్డించడం లేదనే ప్రచారం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు వస్తున్నారు? వారికి ఏమి నేర్పుతున్నారు..? బాలింతలు, గర్భిణులు వస్తున్నారా..? వారికి మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా..? లేదా అనే విషయాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సీసీ కెమెరాలు ఏర్పాటుతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని అధికారులు అంటున్నారు.

సమచారం సేకరణ

జిల్లాలోని ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి.. అద్దె భవనాల్లో ఎన్ని ఉన్నాయి..ఎంత మంది టీచర్లు, సిబ్బంది ఉన్నారు.. పిల్లలు,గర్భిణులు,బాలింతల సంఖ్య ఎంత అనే సమగ్ర సమాచారాన్ని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ అధికారులు జిల్లా అధికారుల నుంచి సేకరించారు. మొదటి విడతలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం తీసుకొస్తే ఎదురయ్యే ఇంటర్‌నెట్ సమస్యలపై అధ్యయనం చేస్తున్నారు.ముందుగా సీసీ కెమెరాల ఏర్పాటుపై రెండు,మూడు రోజుల్లో జిల్లాకు మార్గదర్శకాలు రావచ్చునని సంబంధిత అధికారులు చెబుతున్నారు. విధులకు రాకపోయినా కింది సిబ్బందితో సెంటర్ల ను నడిపిస్తూ హాజరు వేసుకునే టీచర్లకు చెక్ పెట్టేందుకు బయోమెట్రిక్ హాజరును తీసుకరానున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 1,107

7 నెలల నుంచి - 6 సంవత్సరాలలోపు చిన్నారులు	63,095
గర్భిణులు -	6,866
బాలింతలు-	6,145
సొంత భనాలు -	469
అద్దె భవనాలు -	190
విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాలు -	210

బీఆర్‌ఎస్ వాళ్లను చేర్చుకోవద్దు



పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నిస్తున్న కార్యకర్తను అడ్డుకుంటున్న నాయకులు

- కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానన్న ఓ కార్యకర్త
- రసాభాసగా చేరికల కార్యక్రమం

కొత్తూరు: బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. కొత్తూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చేరికల కార్యక్రమం రసాభాసగా మారింది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అంతా సిద్ధం చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఇన్ముల్‌నర్వకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుతగిలారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ గ్రామం నుంచి బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీల నాయకులను ఎలా చేర్చుకుంటారని వాగ్వాదానికి దిగారు. ఒక దశలో సహనం కోల్పోయిన వారు తమపై అధికార మదంతో కేసులు పెట్టించి, ఇబ్బందులకు గురిచేసిన బీఆర్ఎస్ నాయకులను పార్టీలోకి ఎలా తీసుకుంటారని మండిపడుతూ కుర్చీలను విసిరేశారు. ఓ కార్యకర్త పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని డబ్బా తీయడంతో వెంటనే పక్కన ఉన్న వారు లాక్కున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కలుగజేసుకుని వారిని సముదాయించారు. దీంతో తాత్కాలికంగా కార్యక్రమం వాయిదా పడింది. అనంతరం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ నాయకులకు చేరికలపై సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మరోసారి స్థానిక నాయకులతో చర్చిస్తామని, వారి అభిప్రాయం మేరకే చేరికలు ఉంటాయని స్పష్టం చేశారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



పిల్లలకు పోలియో చుక్కలు వేయించారా అని ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరావు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఇటుక బట్టీల వద్ద నివసిస్తున్న చిన్నారుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలిచి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోందని అన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామాలు, తండాలు, గుడిసెల్లో నివాసం ఉంటూ ఇంకా పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ రికార్డుల తనిఖీ

పత్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బొంరాస్‌పేట: స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తరచుగా వస్తున్న దరఖాస్తులు, ధరణి సమస్యలు, పెండింగ్‌లో అంశాలను డిప్యూటీ తహసీల్దారు రవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



నర్సింలు (ఫైల్)

తాండూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన కేసీ నర్సిములు(53) గ్రామ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తాండూరు–కోట్‌పల్లి మార్గంలో నడుచుకుంటూ వేళ్తున్న ఆయనను వెనకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నర్సింలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమారుడు, కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

తుల్జాపూర్ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి: మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో కొలువైన భవానీ అమ్మవారిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అమ్మవారిని ప్రార్థించడంతో ఎమ్మెల్యే దంపతులు మొక్కులు చెల్లించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి ఉమారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చాంద్‌పాషా



అనంతగిరి: తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎండీ చాంద్ పాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై రాష్ట్ర బాధ్యత అప్పజెప్పినందుకు సంతోషంగా ఉందని, హోంగార్డుల సమస్యలపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు.



ప్రాజెక్టు కట్టపై పెరిగిన చెట్లు

నిర్మించారు.. నిర్వహణ మరిచారు!

సాగునీటి ప్రాజెక్టు నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో వెలవెలబోతోంది. సమృద్ధిగా నీళ్లున్నా సరైన నీటిపారుదల వ్యవస్థ లేక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. అధికారుల అలసత్వానికి నందివాగు ప్రాజెక్టు రూపురేఖలు కోల్పోతోంది.

తుప్పు పట్టిన తూములు
- పూడుకుపోయిన కాల్వలు
- ఇదీ నందివాగు ప్రాజెక్టు దుస్థితి

మోమిన్‌పేట: వ్యవసాయానికి సాయంగా ఉండాల్సిన ప్రాజెక్టు నిర్వహణ లేమితో కొట్టుమిట్టాడుతుంది. నందివాగు ప్రాజెక్టును పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తూములు తుప్పు పట్టి, కాల్వలు పూడుకుపోయి, గండ్లు ఏర్పడ్డాయి. దీంతో పచ్చని భూములన్నీ బీళ్లుగా మారుతున్నాయి. దాదాపు 2,650 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్న ఈ ప్రాజెక్టును పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నందివాగు ప్రాజెక్టు కింద కాస్లాబాద్, బూర్గుపల్లి, మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి, మెదక్ జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్, జాజిపురం, దాని అనుబంధ తండాల భూములు ఉన్నాయి. ప్రాజెక్టు నిండా నీరు ఉన్నా భూములన్నీ బీళ్లే. మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం ప్రాజెక్టు శాపంగా మారింది. ప్రాజెక్టును నిర్మించారు.. కానీ నిర్వహణను మాత్రం వదిలేశారని ఆయకట్టు రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్లుగా కాలువలు పూడుకుపోయి, గండ్లు పడ్డా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాలు, స్థానిక ఎమ్మెల్యేలు మారినా ప్రాజెక్టు దశ మాత్రం మారడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కుడి కాలువలో మొలిచిన తుంగ

రూ.10 కోట్లు అవసరం

గతంలో రెండు పంటలకు పుష్కలంగా నీరందించిన ఈ ప్రాజెక్టు, ప్రస్తుతం అర కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములకు సైతం అందివ్వడం లేదు. గతంలో మాదిరి ప్రస్తుతం కమిటీలు లేవు. దీంతో నిధులకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తారేమోనని ఎదురు చూడటం శరా మామూలైపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పూడికతీత, గండ్ల పూడ్చివేత, తూములు, పక్కగోడలు పూర్తిస్థాయిలో నిర్మించాలంటే పది కోట్ల రూపాయలు అవసరమవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగితే తప్పా ఆయకట్టు పచ్చగా మారే అవకాశం లేదు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కాల్వలకు మరమ్మతులు

మిషన్ కాకతీయలో భాగంగా గత ప్రభుత్వం రూ.5 కోట్లతో పనులు చేపట్టినా పూర్తి స్థాయిలో మరమ్మతులు జరగలేదు. నిండుగా పూడుకుపోయిన శిఖంలో మట్టితీత పనులే ఎక్కువ చేయడంతో కాలువలు అలాగే వదిలేశారు. సరైన పాలనా వ్యవస్థ లేక ప్రాజెక్టు అతీగతి లేకుండా పోయిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా వర్షాలు ఎక్కువగా కురిసి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా పంటలు పండించలేక పోతున్నామని కర్షకులు మదనపడుతున్నారు. కుడి, ఎడమ కాలువలు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తే తప్ప ప్రతి పొలానికి నీరు వెళ్లే ప్రసక్తి లేదని వారు వాపోతున్నారు. ఎడమ కాలువలో తుంగను రైతులే తొలగించుకున్నారు. కుడి కాలువలో సైతం కొద్ది దూరం అన్నదాతలే స్వయంగా తుంగను తొలగించుకున్నా ఇంకా కొంత భాగం అలాగే ఉంది. ప్రాజెక్టు కట్టపై చెట్ల పొదలు ఏపుగా పెరిగాయి. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు కావాల్సిన నిధులు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బషీరాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బషీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలల్లో వివిధ కేటగిరిలో పని చేస్తున్న కార్మికులకు నెలనెలా వేతనం చెల్లించకుంటే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇచ్చే అరకొర వేతనాలను నెలల కొద్ది పెండింగ్‌లో పెట్టడంతో వారి జీవితం దుర్భరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకరి చేయిస్తుందని మండిపడ్డారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ధర్నాకు జిల్లాలోని పంచాయతీ కార్మికులు తరలి రావాలని కోరారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బుగ్గప్ప, కార్మికులు శ్యామప్ప, అనంతయ్య, చందు, లక్ష్మి, యాదమ్మ, బుజ్జమ్మ, జగ్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

బషీరాబాద్: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి తాండూరు కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించింది. బషీరాబాద్ ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందర్‌చెడ్ గ్రామానికి చెందిన జెట్టూరు యాదప్ప ఇటీవలే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి మంగళవారం తాండూరు సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ అశోక్ ఎదుట హాజరు పరిచారు. కోర్టు అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు సదరు వ్యక్తిని పరిగి సబ్ జైలుకు తరలించారు.

నలుగురికి జరిమానా

తాండూరు టౌన్: మద్యం తాగి ఆటో నడిపిన ఓ డ్రైవర్‌కు రెండు రోజుల జైలు శిక్ష పడింది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్ సోమవారం మద్యం తాగి ఆటో నడుపుతుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డాడు. మంగళవారం తాండూరు సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ అశోక్ నిందితునికి రెండు రోజుల శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. లక్ష్మణ్, పండరి, షేక్ నిజాంలకు రూ.1500ల చొప్పున జరిమానా వేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

అనంతగిరి: పశ్చిమ బెంగాల్‌లోని తృణముల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని మారుమూల గిరిజన ప్రాంతంలోని ప్రజలపై దాడులు చేయడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంస్థ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిగణేశ్, మంజునాథరెడ్డి, శివప్రసాద్, జగదీశ్‌చారి, ఆదికేశవరెడ్డి, మనీశ్ పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రామకంఠం భూమి కబ్జా చేస్తే చర్యలు

డీఎల్పీఓ సంధ్యారాణి

దోమ: గ్రామకంఠం భూములను కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎల్పీఓ సంధ్యారాణి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించి కబ్జాకు గురైన గ్రామకంఠం భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొందరు గ్రామకంఠం భూమిని కబ్జా చేశారని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. కబ్జాలకు పాల్పడిన వ్యక్తుల వద్ద వాటికి సంబంధించిన ఎలాంటి ధ్రువ పత్రాలు ఉన్నాయో పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలన్నారు. ధ్రువ పత్రాల ఆధారంగా గ్రామ కంఠం భూమి ఉంటుందని, కబ్జాలకు గురైతే స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్, గ్రామస్తులు బాబయ్య, రాములు, జనార్దన్, రవి, సుభాన్, అంజయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న డీఎల్పీఓ సంధ్యారాణి

చిన్నారులందరికీ వ్యాక్సిన్ అందాలి

డబ్ల్యూహెచ్ఓ మానిటర్ కౌశిక్

పరిగి: రిస్క్ ఏరియాలోని చిన్నారులందరికీ పోలియో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ మానిటర్ కౌశిక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రంగంపల్లి, హైరిస్క్ ప్రాంతాల్లో పర్యటించి పోలియో చుక్కల నిర్వహణను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైరిస్క్ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. నిరుపేదలు, నిరక్షరాసులు కావడంతో పోలియో చుక్కలు వేసుకునేందుకు వెనుకంజ వేస్తారన్నారు. కావునా వారి వద్దకు వెళ్లి పోలియో వేయాలని సిబ్బందికి సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న వారిలో చిన్న పిల్లలను గుర్తించాలన్నారు. వంద శాతం పోలియో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి చేతిని చూసి నిర్ధారణ చేసుకుంటున్న కౌశిక్

దివ్యాంగులకు చేయూతనివ్వండి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

తాండూరు రూరల్: నిరుపేద దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ కొనియాడారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్, సిడ్బిల ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల స్వయం ఉపాధిపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. రెడ్డిస్ ఫౌండేషన్, సిడ్బిల ఆధ్వర్యంలో 37 మంది దివ్యాంగులకు రూ.25 వేల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం ఆనంద్, ఏపీఓ నరోత్తంరెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, లక్ష్మి, శ్రీనివాస్, ఉదయ్, రామేశ్వర్, హనుమంత్‌రెడ్డి, జ్యోతి, శ్రీశైలం పాల్గొన్నారు.



దివ్యాంగులకు చెక్కులు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

వీగిన అవిశ్వాసం

ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్ల డుమ్మా

తుర్కయంజాల్: ముందుగా ఊహించిన విధంగానే మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మంగళవారం మున్సిపల్ పరిధి రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటలకు అధికారులు సమావేశం ప్రారంభించగా 11.30 గంటల వరకు ఒక్క కౌన్సిలర్ కూడా సమావేశానికి హాజరవ్వలేదు. అరగంటల విరామం అనతరం 12గంటల నుంచి 12.30గంటల వరకు అవకాశం ఇచ్చినా హాజరవ్వలేదు. ఈ సందర్భంగా ఆర్డీఓ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఫిబ్రవరి 2న 18 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు తీర్మానం నోటీసును అందజేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మంగళవారం అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. జీఓఎంఎస్ నంబర్ 835 ప్రకారం సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ సమయానికి ఒక్కరు కూడా హాజరు కాలేదు. దీంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ వీగిపోయిందని ఆయన ఆర్డీఓ ప్రకటించారు. సభ్యులు హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక సమావేశం ఉన్నందున ఆదిబట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేకాట జోరు.. బతుకు తారుమారు

పూడూర్ మండల కేంద్రంలోని ఓ మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట ఆడుతుండగా పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ముఖ్య రాజకీయ నాయకుని ఫాంహౌస్‌లో ఈ వ్యవహారం సాగడంతో నియోజకవర్గం వ్యాప్తంగా చర్చనీయాంశమయింది. ఇదే తరహాలో ఫాంహౌస్‌లు, లాడ్జీల్లో జిల్లా వ్యాప్తంగా పేకాట జోరుగా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- వీధిన పడుతున్న కుటుంబాలు
- ఫాంహౌస్‌లు, లాడ్జిల కేంద్రంగా వ్యవహారం

పరిగి: పేకాట పేరు వింటేనే మధ్య తరగతి కుటుంబాల గుండెల్లో గుబులు పుడుతోంది. దీనికి ఒకసారి అలవాటు పడితే జీవితాలు ఛిన్నాభిన్నం అవ్వడం ఖాయం. ఈ ఆటకు బానిసలై ఆస్తులు అమ్ముకుని కుటుంబాలను రోడ్డున పడేసిన వారు ఎందరో ఉన్నారు. ప్రస్తుతం పరిగి నియోజకవర్గంతో పాటు జిల్లాలో పేకాట మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతుంది. నిత్యం పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు చేస్తునే ఉన్నారు. జూద క్రీడలో రోజుకు లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. దీంతో పేకాట ఆడే వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా

జిల్లాల్లోని అన్ని పట్టణాలు, పల్లెల్లో పేకాట జోరుగా సాగుతుంది. దీనికోసం జిల్లా సరిహద్దుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఆడుతున్నట్టు సమాచారం. పట్టణాలు, గ్రామ శివారు ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, వ్యాపార కేంద్రాలే అడ్డాలుగా ఏర్పాటు చేసుకొని పేకాట ఆడుతున్నారు. పట్టణ, గ్రామీణ శివారు ప్రాంతాల్లో అయితే ఎవరికీ అనుమానం రాదన్న కారణంతో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లాల్లోని మున్సిపాలిటీ కేంద్రాల్లో, గ్రామాల్లో జూద స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.



పూడూరులో పేకాట ఆడుతుండగా పట్టుకున్న పోలీసులు (ఫైల్)

బడాబాబులకు ఫాంహౌస్‌లే అడ్డా

బడాబాబులు పలు ప్రాంతాల నుంచి వచ్చి ఒక గ్రూపుగా ఏర్పడి జోరుగా పేకాట ఆడుతున్నారు. అర్ధరాత్రి అయితే ఎవరూ గుర్తుపట్టరని యథేచ్ఛగా సాగిస్తున్నారు. జిల్లాలోని పేకాటరాయుళ్లకు లాడ్జిలే అడ్డాలుగా మారాయి. పరిగి శివారు షాద్‌నగర్ రూట్‌లో, మన్నేగూడ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఫాంహౌస్‌లోనే పేకాటను జోరుగా కొనసాగుతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడాబాబులు పోలీసులకు సమాచారం అందించి ఎంతో కొంత చేతులు తడిపి పేకాట ఆడుతున్నట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఎన్ని దాడులు నిర్వహించినా పేకాటరాయుళ్లు మాత్రం ఆటను మానడం లేదు.

ఆన్‌లైన్ జూదంలోకి యువత

ప్రస్తుతం అందరి వద్ద ఆండ్రాయిడ్ మొబైల్ ఉండటంతో ఎక్కువగాా యువత ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడుతున్నారు. ఆన్‌లైన్ రమ్మీ ఆడి రూ.వేల నుంచి రూ.లక్షల్లో పోగొట్టుకున్న వారు ఎందరో ఉన్నారు. బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు డిపాజిట్ జమ చేయడం, గేమ్ ఆడటం, డబ్బులు పోగొట్టుకోవడం పరిపాటిగా మారింది. పోయిన డబ్బుల కోసం మళ్లీ డబ్బులు పెట్టడం, ఇలా చేతులు కాల్చుకున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. కొంత మంది స్నేహితులు, తెలిసిన వారి వద్ద వడ్డీకి తెచ్చి మరి గేమ్ ఆడుతున్నారు. అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి గొడవలు చేయడంతో తల్లిదండ్రులు కంగుతింటున్నారు. చేసేది ఏమి లేక పిల్లలు చేసిన అప్పులను తీర్చి రోడ్డున పడ్డవారు ఎందరో ఉన్నారు.

పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు



పేకాట స్థావరాల సమాచారాన్ని పోలీసులకు అందించాలి. ఇప్పటికే కొన్నింటిపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో పేకాట ఆడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. జూదం ఆడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

– శ్రీనివాస్, సీఐ, పరిగి

నేడు డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రగతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం డీఎస్సీపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ శ్రీశైలం యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. అపార అనుభవం గల అవనిగడ్డ ఫ్యాకల్టీ చారి, లింగంగౌడ్ అధ్యాపకులతో జీకే, కరెంట్ అఫైర్స్‌తో పాటు విద్యా దృక్పథాలపై ఉదయం 9.30 గంటలకు సదస్సు ఉంటుందన్నారు. నియోజకవర్గ అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

తాండూరు టౌన్: బీఆర్ఎస్ తాండూరు పట్టణాధ్యక్షుడు నయీమ్(అప్పు)పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ ముందు షెడ్డు నిర్మించే క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. అయితే బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నయీమ్ అతని అనుచరులు కలిసి తనని కులం పేరుతో దూషిస్తూ, దాడి చేశారని రాహుల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నయీమ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన హైకోర్టు అడ్వొకేట్

బషీరాబాద్: మండలంలోని మల్కన్‌గిరి గ్రామానికి చెందిన హైకోర్టు అడ్వొకేట్ ఎం.రవికుమార్ మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామం ఇప్పటికీ అనుబంధ గ్రామంగానే ఉందని, గత ప్రభుత్వంలో ప్రత్యేక పంచాయతీగా జీఓ వచ్చినా నేటికి అతీగతి లేదన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు బాలకృష్ణ, రమేశ్, శ్రీశైలంతో కలిసి ఆయన సునీతారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు జెడ్పీ నుంచి రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



సునీతారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం

ఆర్‌బీఐ హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ అనుజ్ రంజన్

ఇబ్రహీంపట్నం రూరల్: డిజిటల్ లావాదేవీల విషయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ అనుజ్ రంజన్ సూచించారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో నిర్వహించిన జాతీయ స్థాయి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డిజిటల్ ట్రాన్సాక్షన్స్, సైబర్ ఫ్రాడ్స్, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా అనుజ్ రంజన్ మాట్లాడుతూ.. కంప్యూటర్ సాధనంగా లేదా నేరాలకు పాల్పడే మార్గం ఉపయోగించే నేరపూరిత చర్యలు అన్ని సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయన్నారు. కంప్యూటర్, నెట్‌వర్క్, నెట్‌వర్క్ డివైజ్‌లు లక్ష్యంగా చేసే దాడి లేదా నేరపూరిత చర్యలకు దూరంగా ఉండలన్నారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనుకునే సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు ఇలాంటి నేరాలకు పాల్పడుతారన్నారు. వ్యక్తులు లేదా సంస్థలు ఒక ఉమ్మడి ప్రణాళిక ప్రకారం మోసాలు చేయాలనుకుంటారని వివరించారు. క్రెడిట్, డెబిట్ కార్డుల పేరు, పాస్‌వర్డ్ లాంటి సున్నితమైన సమాచారాన్ని దొంగిలిస్తారని చెప్పారు. 1930 నంబర్‌కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎస్ సైనీ, కళాశాల డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్స్‌పాల్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.